విద్యార్థులను అభినందిస్తున్న రమేశ్ రెడ్డి

'మెడికో హెల్త్ కేర్'కు శ్రీ చైతన్య డిగ్రీ విద్యార్థుల ఎంపిక

కమాన్‌చౌరస్తా, మే 17: జిల్లా కేంద్రంలోని మంకమ్మతోటలో గల శ్రీ చైతన్య డిగ్రీ, పీజీ కళాశాలలో మెడికో హెల్త్ కేర్ సర్వీస్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌కు మంచి స్పందన వచ్చినట్లు కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్యాంపస్ డ్రైవ్‌కు చివరి సంవత్సరం విద్యార్థులు 110 మంది హాజరుకాగా, ఇంటర్వ్యూ, వివిధ దశల్లో జరిగిన ఎంపిక ప్రక్రియలో 21 మంది విద్యార్థులు ప్రతిభ చూపి ఉద్యోగాలు సాధించారని తెలిపారు. వారికి వార్షిక వేతనం రూ.2.5 లక్షలు ఉంటుందని వెల్లడించారు. విద్యార్థులకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా తమ సంస్థ పని చేస్తున్నదని, ప్రతి విద్యా సంవత్సరంలో దాదాపు 100 మంది శ్రీ చైతన్య డిగ్రీ విద్యార్థులు బహుళ జాతి సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికవడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎల్ శ్రీనివాస్, డాక్టర్ వీ స్వర్ణలత, వైస్ ప్రిన్సిపాల్ ఎస్ కృష్ణారెడ్డి, కళాశాల సిబ్బంది, కంపెనీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెబినార్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

జ్యోతిష్మతి విద్యార్థులకు లుసియానా టెక్ యూనివర్సిటీ వెబినార్

తిమ్మాపూర్ రూరల్, మే 17: అమెరికాలో ఉన్నత విద్యకు సంబంధించి మండలంలోని జ్యోతిష్మతి అటానమస్ ఇంజినీరింగ్ కళాశాల అమెరికాలోని లూసియానా టెక్ యూనివర్సిటీ ఇటీవల అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శుక్రవారం జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు లూసియానా యూనివర్సిటీ ఇంటర్నేషనల్ ఎఫైర్స్ డైరెక్టర్ జై.ఆర్.లిగాన్, లూసియాన టెక్ యూనివర్సిటీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ఫర్ రీసెర్చ్ డీన్ ఆఫ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ప్రొఫెసర్ బి.రాము రామచంద్రన్ ఎం.ఎస్. కోర్స్ అడ్మిషన్స్‌పై వెబినార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ విద్యార్థులు ఉన్నత విద్యలో భాగంగా అడ్మిషన్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, స్కాలర్‌షిప్స్, ప్రాంగణ నియామకాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సెప్టెంబర్, ఫిబ్రవరిలో నిర్వహించే అడ్మిషన్ల ప్రక్రియకు సన్నద్ధం కావాలని విద్యార్థులకు సూచించారు. ఏజెంట్లను సంప్రదించి ఇబ్బందుల్లో పడకుండా అమెరికాలో సులువుగా ఉన్నత విద్యను అభ్యసించేలా జ్యోతిష్మతి అటానమస్ ఇంజినీరింగ్ కళాశాల, అమెరికాలోని లూసియానా టెక్ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలిపారు. అమెరికాలో 1894లో స్థాపించిన లూసియానా టెక్ యూనివర్సిటీ ఇంజినీరింగ్, సైన్స్, వ్యాపార కార్యక్రమాలకు ప్రసిద్ధి చెందిందని వెల్లడించారు. కార్యక్రమంలో జ్యోతిష్మతి అటానమస్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు, కరస్పాండెంట్ సెక్రటరీ జువ్వాడి సుమిత్ సాయి, ప్రిన్సిపాల్ డాక్టర్ కే శ్రీనివాసరావు, డీన్ అకాడమిక్స్ పి.కె. వైశాలి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐటీఐ మొదటి దఫా అడ్మిషన్లు ప్రారంభం

కమాన్‌చౌరస్తా, మే 17 : 2024-25 విద్యా సంవత్సరానికి గానూ ఎన్‌సీవీటీ ప్యాట్రన్ కింద వివిధ ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ కోర్సులకు సంబంధించి ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కాలేజీల్లో మొదటి దఫా అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎస్ కవిత తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ వెబ్‌సైట్ http://iti.telangana.gov.in ద్వారా రూ.100 రిజిస్ట్రేషన్ ఫీజుతో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వెబ్ ఆప్షన్ల దాఖలుకు ఈ నెల 16 నుంచి జూన్ 10 వరకు గడువు ఉంటుందని, అర్హులైన అభ్యర్థులు వినియోగించుకోవాలని సూచించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME
★Peddolla Raju, S/o. Rajaiah, H.No. 7-20/1, Nizamabad V/o Konaraopet Mandal, Rajanna Sircilla Dist. my surname was changed as Thallapelly Raju S/o Rajaiah.
NTK-000

CHANGE OF NAME
★I, MEENA RAVI S/o. KISHTAIAH, M.A.B.Ed., School Assistant, shall henceforth be known as SRI MEESA RAVI S/o. KISHTAIAH, for the purpose of correction wrong entries occurred in school records due to parental mistake.
NTK-000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

రంగస్థల నటుడి మృతికి సంతాపం

హుజూరాబాద్ టౌన్, మే17: హుజూరాబాద్ మండలం పెద్దపాపయ్యపల్లెకు చెందిన రంగస్థల నటుడు, సీనియర్ కళాకారుడు పోరెడ్డి శ్రీనివాసరెడ్డి (68) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందగా, మాజీ సర్పంచ్, ఎంపీటీసీతో పాటు రంగస్థల కళాకారులు, సీనియర్ కళాకారులు తమ ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. పోరెడ్డి శ్రీనివాసరెడ్డి పెద్దపాపయ్యపల్లి గ్రామంలో మొట్టమొదటి సారిగా శివరామ కృష్ణ భజన మండలి స్థాపించి ఎంతోమంది కళాకారులను తయారు చేశారు. అలాగే హుజూరాబాద్‌లో నటరాజ కళాకారుల సంక్షేమ సంఘం స్థాపించి అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

భారీ వర్షంతో ఉపశమనం

శంకరపట్నం, మే 17: మండల వ్యాప్తంగా శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. భానుడి భగభగలకు అల్లాడుతున్న జనానికి చల్లని వర్షంతో ఉపశమనం కలిగినట్లైంది. అరగంట పాటు కురిసిన భారీ వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. కాగా, అక్కడక్కడా స్వల్పంగా ధాన్యం తడిసినట్లు తెలుస్తున్నది. వర్షం నింపాదిగా కురవడం వల్ల ఇతరత్రా ఎలాంటి నష్టం సంభవించలేదు.

ఎంబీఏ, ఎంసీఏ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

కొత్తపల్లి, మే 17 : ఇటీవల విడుదలైన శాతవాహన యూనివర్సిటీ ఎంబీఏ, ఎంసీఏ మొదటి, మూడో సెమిస్టర్ ఫలితాల్లో ఎస్ఆర్ఎం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపాల్ సీ వెంకటేశ్వర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ మొదటి సెమిస్టర్‌లో గుంటి త్రివేణి 6.97, వేల్పుల శ్రీవాణి 6.73, ఎంసీఏలో ఏ సుధీక్ష 8.0, వీ స్పందన 7.9 జీపీఏ సాధించినట్లు వెల్లడించారు. అలాగే ఎంబీఏ మూడో సెమిస్టర్‌లో ఎం హర్షిత 6.81, పీ నవ్య 6.73, ఎంసీఏలో వీ శ్రీజ 7.72, బీ సౌమ్య 7.58 జీపీఏతో సత్తాచాటారన్నారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ ఎం తిరుపతి రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి

- ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్

కలెక్టరేట్, మే 17 : ప్రజావాణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు, ధాన్యం కొనుగోళ్లు, ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 20 రోజుల్లోగా పాఠశాలల్లో మౌలిక వసతులకు సంబంధించిన పనులన్నీ పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలల ప్రారంభానికి ముందే విద్యుత్, తాగునీరు సరఫరా, కలరింగ్, టాయిలెట్స్, అదనపు తరగతి గదుల నిర్మాణం పనులు పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు స్కూల్ యూనిఫాం త్వరగా అందించాలని పేర్కొన్నారు. వరి ధాన్యం కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా సీఎంఆర్ డెలివరీ చేయాలని సూచించారు. ఈ అంశంలో కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. సీఎంఆర్ లక్ష్యసాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్‌వో పవన్ కుమార్, ఆర్డీవో కే మహేశ్వర్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, సివిల్ సప్లై జీఎం రజినీకాంత్, ఇన్‌చార్జి డీసీఎస్‌వో సురేశ్ రెడ్డి, డీఆర్డీవో శ్రీధర్, డీఈవో జనార్దన్ రావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అధిక రక్తపోటుతోనే అనర్థాలు

- తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నెల రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి సుజాత

వెబినార్‌లో పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

విద్యానగర్, మే 17: అధిక రక్తపోటుతో అనర్థాలు వస్తాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సుజాత తెలిపారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో ప్రపంచ అధిక రక్తపోటు దినం సందర్భంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఇండియా, న్యూఢిల్లీ నుంచి వెబినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అధిక రక్తపోటు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నెల రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 30 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు రక్తపరీక్షలు చేసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. తలనొప్పి, దృష్టి లోపం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట, గుండె వేగంగా కొట్టుకోవడం లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. గుండెపోటు, పక్షవాతం, మూత్ర పిండాల వ్యాధి, దీర్ఘకాలిక వ్యాధులకు గురి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమతుల్యమైన ఆహారం తీసుకుని రోజుకు కనీసం 30నుంచి 60 నిమిషాల వరకు నడక, యోగా, మెడిటేషన్ లాంటివి దినచర్యలో భాగంగా చేసుకోవాలన్నారు. ఆహారంలో అధిక ఉప్పును నివారించడంతోపాటు ధూమ, మద్యపానం, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. వీటితో అధిక రక్తపోటును నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, స్టాఫ్‌నర్సులు పాల్గొన్నారు.

అనేక ఆరోగ్య సమస్యలకు హైపర్ టెన్షనే కారణం

- మెడికవర్ వైద్యులు నాగరాజు, ప్రతిష్టారావు

మాట్లాడుతున్న మెడికవర్ వైద్యులు నాగరాజు, ప్రతిష్టారావు

విద్యానగర్, మే 17: మనిషిలో వచ్చే అనేక ఆరోగ్య సమస్యలకు హైపర్ టెన్షనే కారణమని మెడికవర్ ఫిజిషియన్ డాక్టర్ నాగరాజు, గైనకాలజిస్టు డాక్టర్ ప్రతిష్టారావు తెలిపారు. వరల్డ్ హైపర్ టెన్షన్ డే సందర్భంగా మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రీజినల్ పీఎఫ్ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం, హెల్త్ టాక్‌తో అవగాహన కల్పించారు. 150 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, హైపర్ టెన్షన్ సమస్యతో ఎంతో మంది ఇబ్బంది పడుతున్నారని, దీనికి పనుల ఒత్తిడి, మానసిక ఒత్తిడి, ఆల్కహాల్ తీసుకోవడం కారణాలని తెలిపారు. హైబీపీని నిర్లక్ష్యం చేస్తే రక్త నాళాలపై ఒత్తిడి పెరిగి గుండె సంబంధ, స్ట్రోక్ వంటి సమస్యలు వస్తాయన్నారు. చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకుంటూ ప్రతి రోజూ వ్యాయామం, మెడిటేషన్ చేస్తూ, ఒత్తిడిలేకుండా జీవించడం వల్ల బ్లడ్ ప్రెషర్‌ను అదుపులో పెట్టవచ్చన్నారు. పీఎఫ్ కమిషనర్ ఎస్ తానయ్య మాట్లాడుతూ, ఉద్యోగులు, పెన్షనర్ల కోసం మెడికవర్ హాస్పిటల్ ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ఎమర్జెన్సీ హెచ్‌వోడీ డాక్టర్ సత్యనారాయణ బీఎల్ఎస్ ట్రైనింగ్‌పై అవగాహన కల్పించారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ కర్ణాకర్, హెచ్‌ఆర్ మేనేజర్ ఈశ్వర్, పీఎఫ్ కార్యాలయ సిబ్బంది, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

జీవీఆర్ పరామర్శ

బాలయ్యను పరామర్శిస్తున్న జీవీ రామకృష్ణారావు

మానకొండూర్ రూరల్, మే 17: శంషాబాద్ బీఆర్ఎస్ గ్రామ ఉపాధ్యక్షుడు కొండ బాలయ్య భార్య కనకవ్వ గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందగా, శుక్రవారం ఆయనతోపాటు కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు పరామర్శించారు. జీవీఆర్ వెంట జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, నాయకులు బాకారపు ఐలయ్య, బూస సంతోష్, మేరుగు సంపత్, గట్టు మచ్చయ్య, రాజయ్య, సృజన్, బాకారపు రమేశ్, రాయమల్లు, మల్లేశం, డొల్ల సతీశ్ తదితరులు ఉన్నారు.

ప్రారంభమైన క్రైస్తవ ఉజ్జీవ మహాసభలు

సందేశం వినిపిస్తున్న బ్రదర్ జెన్నీ క్రిస్టోఫర్

కమాన్‌చౌరస్తా, మే 17 : జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ సంఘాల ఆధ్వర్యంలో సెయింట్ మార్క్ చర్చి గ్రౌండ్‌లో క్రైస్తవ ఉజ్జీవ మహాసభలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సభకు బ్రదర్ జెన్నీ క్రిస్టోఫర్ హాజరు కాగా, క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రేపు, ఎల్లుండి జరిగే ఉజ్జీవ మహాసభల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రొఫెసర్ కే రూబెన్ మార్క్, డాక్టర్ పరిమళ రూబెన్ మార్క్, పాల్ కొమ్మాలు, డాక్టర్ ఎస్ జాన్, ఆర్ ప్రసాద్, బీ ప్రసాద్, ఏ మధు మోహన్, పింటు, రోజి, రెనాల్డ్, తిమోతి, క్రిస్టోఫర్, ఇండిపెండెంట్ పాస్టర్స్, స్థానిక సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

అన్ని రకాల వడ్లకు బోనస్ వర్తింపజేయాలి

- తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి

హుజూరాబాద్ టౌన్, మే 17: రైతులు పండించిన అన్ని రకాల వడ్లకు బోనస్ వర్తింపజేయాలని, అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వాసుదేవరెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో క్వింటాల్ వడ్లకు రూ.500 బోనస్ చెల్లిస్తామంటూ హామీ ఇచ్చిందని, అందులో సన్న, దొడ్డు బియ్యం అంటూ ఎక్కడా ప్రస్తావించలేదని పేర్కొన్నారు. ఇప్పుడు సన్నబియ్యం పండించే వారికి మాత్రమే బోనస్ వస్తుందనే వార్తలు రైతులను తీవ్ర ఆందోళన గురిచేస్తున్నాయని, అన్ని రకాల వడ్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతుల్లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. మామిడి రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వెలమారెడ్డి రాజిరెడ్డి, జిల్లా నాయకుడు గుండేటి వాసుదేవ్, మండల నాయకులు ఎండీ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా లయన్స్ మల్టికాన్ ప్రారంభం

లయన్స్ మల్టికాన్‌ను ప్రారంభిస్తున్న కౌన్సిల్ చైర్మన్ తీగల మోహన్‌రావు

విద్యానగర్, మే 17: తెలంగాణ, కర్నాటకలోని కొంత ప్రాంతంతో కూడుకున్న లయన్స్ ఇంటర్నేషనల్ మల్టీపుల్ జిల్లా 320 వార్షిక సమావేశం మల్టికాన్ శుక్రవారం స్థానిక ప్రతిమా హోటల్‌లో అట్టహాసంగా ప్రారంభించారు. కౌన్సిల్ చైర్మన్ తీగల మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబూరావు, గ్యాట్ ఏరియా లీడర్ సునీల్ కుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మల్టీపుల్‌లోని వివిధ జిల్లాల్లో జరిగిన సేవా కార్యక్రమాల సింహావలోకనం జరిగింది. జిల్లాలోని వివిధ కంటి హాస్పిటల్స్ ద్వారా అందించిన సేవలు మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమం ద్వారా చేస్తున్న అన్నదాన కార్యక్రమ వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో 2024-25 సంవత్సరానికి కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశం మూడు రోజుల పాటు జరుగనుండగా, చైర్మన్‌గా హన్మాండ్ల రాజిరెడ్డి, వైస్ చైర్మన్‌గా కే హరీశ్‌రెడ్డి, సెక్రటరీగా ఎన్ వెంకటేశ్వర్‌రావు, కోశాధికారిగా రేసు మల్లారెడ్డి, జాయింట్ సెక్రటరీగా శివ ప్రసాద్‌ను ఎన్నుకున్నారు.

జిల్లా గ్రానైట్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ వర్కింగ్ కమిటీ ఎన్నిక

సమావేశంలో పాల్గొన్న గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్లు, అడ్వైజరీ కమిటీ సభ్యులు

కొత్తపల్లి, మే 17 : కరీంనగర్ జిల్లా గ్రానైట్ ఇండస్ట్రీస్ అసోసియేషన్‌కు 18 మంది సభ్యులతో కూడిన తాత్కాలిక వర్కింగ్ కమిటీని ఎన్నుకున్నారు. అడ్వైజరీ కమిటీ సభ్యులు చిట్టిమల్ల శ్రీనివాస్, మధుసూదన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా గ్రానైట్ ఇండస్ట్రీ అసోసియేషన్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించి మెజార్టీ సభ్యుల ఆమోదం మేరకు ఈ వర్కింగ్ కమిటీని ఎన్నుకున్నారు. అసోసియేషన్‌కు ఎన్నికలు నిర్వహించడంతో పాటు కొత్త అధ్యక్షుడిని ఎన్నుకొనే వరకు ఈ వర్కింగ్ కమిటీ అసోసియేషన్‌కు సంబంధించిన అన్ని కార్యక్రమాలు చూసుకుంటుందని సభ్యులు తెలిపారు. వర్కింగ్ కమిటీలో జువ్వాడి ప్రణీత్ రావు, నరేన్ రాచకొండ, బూర సాగర్, గుడిపాటి సుదర్శన్‌రెడ్డి, ఆర్ విక్రం, టీ సతీశ్‌రావు, పెద్ది సత్యనారాయణ, సోమినేని కనకయ్య, జుట్టు మధు, కే సత్యనారాయణరెడ్డి, సోమినేని కరుణాకర్, ఆర్ మహేశ్‌కుమార్, షేక్ బాషా, ఎస్ గోపాల్, సాగి సాగర్‌రావు, ఆర్ రాంభూపాల్‌రెడ్డి, టీ శ్యాంరావు, దువ్వాడి ఈశ్వర్‌రెడ్డి తదితరులున్నారు. సర్వసభ్య సమావేశంలో అడ్వకేట్ వేణుగోపాల్, గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో అక్రమాలు

- నగరంలో ప్రతి పనికీ అడ్డగోలుగా అంచనా రేట్ల పెంపు
- కాంట్రాక్టర్లతో అధికారులు కుమ్మక్కయినట్లు ఆరోపణలు
- తాజాగా ఉన్నతాధికారులకు బీఆర్ఎస్ కార్పొరేటర్ ఫిర్యాదు

కార్పొరేషన్, మే 17: కరీంనగంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో అక్రమాలు జరుగుతున్నాయి. పలువురు కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులు కుమ్మక్కై ప్రజాధనాన్ని అందినకాడికి దండుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా పండుగల సందర్భంగా నగరంలో చేపడుతున్న పనులకు సంబంధించి అంచనా రేట్లు ఇష్టారీతిలో పెంచి బిల్లులు చెల్లిస్తున్నారని ఇప్పటికే ఫిర్యాదులు వస్తున్నాయి. అలాగే చౌరస్తాల సుందరీకరణ పనుల్లోనూ అంచనాలు విపరీతంగా పెంచి రూ.కోట్ల మేరకు బిల్లులు చెల్లింపులు చేస్తున్నారని గతంలోనే పలువురు కార్పొరేటర్లు సైతం ఫిర్యాదు చేశారు. ఇంజినీరింగ్ విభాగంలోని కొందరు అధికారులు కాంట్రాక్టర్ల నుంచి అమ్యామ్యాలు తీసుకొని వారికి అనువుగానే టెండర్ల నిబంధనలు పెడుతున్నారన్న ఫిర్యాదులు కూడా ఉన్నాయి. ఈ అక్రమ వ్యవహారాలపై ఫిర్యాదులు వస్తున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తుండగా, తాజాగా ఇదే విషయంపై బీఆర్ఎస్ కార్పొరేటర్ బండారి వేణు నేరుగా రాష్ట్ర మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శికి ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. చౌరస్తాల సుందరీకరణలో ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు కలిసి భారీగా అంచనా రేట్లను పెంచి దోచుకున్నారని, పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని ఫిర్యాదు చేశారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

నగరపాలక సంస్థలో పలువురు ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ప్రజాధనాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. హౌసింగ్‌బోర్డు, బైపాస్, తెలంగాణ చౌక్‌ల సుందరీకరణ పనులు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనుల్లో వాస్తవ విలువకు విరుద్ధంగా 5 రెట్లు పెంచి బిల్లులు డ్రా చేశారు. కాంట్రాక్టర్‌తో ఇంజినీరింగ్ శాఖలోని ఓ డీఈ స్థాయి అధికారి కుమ్మక్కై డబ్బులు పంచుకున్నారు. వీరిపై ఇప్పటికే మున్సిపల్ కమిషనర్, కలెక్టర్, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశా. ఇప్పుడు మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శికి ఫిర్యాదు చేశా. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి.

- బండారి వేణు, కార్పొరేటర్

మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి

పిల్లలను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి

రాంనగర్, మే 17: చదువుతో పాటు క్రీడల్లో కూడా పిల్లలను ప్రోత్సహించాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి తల్లిదండ్రులకు సూచించారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలోని జాన్ విల్సన్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో పోలీస్ సిబ్బంది పిల్లలకు వేసవి సెలవుల సందర్భంగా సమ్మర్ క్యాంపును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, క్యాంపు రెండు వారాలపాటు కొనసాగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా పిల్లలకు డ్రాయింగ్, పెయింటింగ్, డ్యాన్స్, సింగింగ్, అథ్లెటిక్స్, కరాటే, ఫుట్‌బాల్, క్రికెట్ వంటి వాటిల్లో శిక్షణ ఇప్పించనున్నామని చెప్పారు. ఇందు కోసం సుశిక్షితులైన టీచర్లు, కోచ్‌లను నియమించామన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల పిల్లల్లో మానసికోల్లాసం, శారీరక దృఢత్వంతో పాటు ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (శాంతి భద్రతలు) ఏ లక్ష్మీనారాయణ , రిజర్వు ఇన్‌స్పెక్టర్లు సురేశ్, శ్రీధర్‌రెడ్డితో పాటు టీచర్లు, కోచ్‌లు పాల్గొన్నారు.

నిరంతర మంచినీటి సరఫరా పనుల పరిశీలన

కార్పొరేషన్, మే 17: కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీ కింద చేపడుతున్న 24 గంటల మంచినీటి సరఫరా పనులను శుక్రవారం నగర కమిషనర్ శ్రీనివాస్ పరిశీలించారు. పైలెట్ ప్రాజెక్టుగా నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలోని రిజర్వాయర్ పరిధిలో 24 గంటల మంచినీటి సరఫరాకు సంబంధించిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హౌసింగ్‌బోర్డు రిజర్వాయర్ పరిధిలో త్వరలోనే 24 గంటల మంచినీటి సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే పనులన్నీ కూడా పూర్తి దశకు వచ్చాయన్నారు. ఎక్కడ కూడా ఎలాంటి సమస్యలు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో డీఈ మహేందర్, ఏఈ వాణి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, మే 17 : నగరంలోని పలు 33/11కేవీ సబ్ స్టేషన్లలో మెయింటనెన్స్, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున శనివారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1, 2 ఏడీఈలు ఎస్ నరేందర్, సుధీర్ కుమార్ వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఉదయం 9నుంచి 11గంటల వరకు 33/11కేవీ వావిలాలపల్లె, బ్యాంకు కాలనీ, వాటర్ వర్క్స్(హౌసింగ్ బోర్డు), సుభాష్ నగర్, అదే విధంగా ఉదయం 9నుంచి 11 గంటల వరకు 33/11కేవీ ఉజ్వల పార్క్, సప్తగిరి కాలనీ సబ్ స్టేషన్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

హుజూరాబాద్‌టౌన్, మే17: హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని హుజూరాబాద్ ట్రాన్స్‌కో టౌన్ ఏఈ ఎం శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఉదయం 8 నుంచి 11 గంటల వరకు హుజూరాబాద్ పట్టణం, బోర్నపల్లి, కొత్తపల్లి, తుమ్మనపల్లి ప్రాంతాల్లో సరఫరా నిలిపి వేస్తున్నామని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలి

నగునూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లయ్ డీఎం, డీఎస్‌వో

కరీంనగర్ రూరల్, మే 17: కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం బస్తాలను వెంటవెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని సివిల్ సప్లయ్ డీఎం రజినీకాంత్, డీఎస్‌వో సురేశ్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం నగునూర్ వ్యవసాయ మార్కెట్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలను పరిశీలించారు. రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రం నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కేంద్రం నుంచి ప్రస్తుతం మూడు రైస్ మిల్లులకు ధాన్యం తరలిస్తుండగా, అదనంగా మరో రెండు రైస్ మిల్లులను కేటాయిస్తున్నట్లు తెలిపారు. సింగిల్ విండో సీఈవో రమేశ్, డైరెక్టర్ సాయిల్ల మహేందర్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

జాబ్ కార్డు ఉన్న వారందరికీ ఉపాధి పని కల్పించాలి

చిగురుమామిడి, మే 17 : మండలంలోని చిగురుమామిడి, ముల్కనూరు, సీతారాంపూర్ తదితర గ్రామాల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) పనులను శుక్రవారం ఎంపీడీవో మధుసూదన్ పరిశీలించారు. గ్రామాల్లో జాబ్ కార్డు కలిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. ఆయన వెంట ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.